తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# ట్రాజెడి ఆఫ్ ఎరర్స్

నిర్మలాదిత్య

''ఇవ్వాళైన ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్తారా లేదా? ఇవ్వాళ ఆఖరి రోజట'' అంది సీత.

''చూస్తానే. అంతా, ఆఫీసులో ఉండే పనిని బట్టి ఉంటుంది. అస్సలు ఆ సుబ్బారావు అనుకున్నాడంటే నేను ఇంటికి తొందరగవచ్చేయొచ్చు. అడిగి చూస్తాను. ఏమంటాడో మరి'' అన్నాడు రామారావు, సీత భర్త.

''ఇదిగో మళ్ళీ చెప్తున్న. వారం రోజుల నుంచి తీసుకెళ్తానని ఊరిస్తున్నారు. ఇవ్వాళ రాకపోయారంటే నేను మా పుట్టింటికి వెళ్ళిపోతాను.''

''సర్లేవే నేను రావడానికే ప్రయత్నిస్తాను. అంతా సుబ్బారావు చేతుల్లో ఉందన్నానుగ.'' రామా రావు మాట్లాడటం పూర్తికాకుండానే, సీత ''బాగానే వుంది మీ వరస మాట్లాడితే ఆ సుబ్బారావు సాకు తీసుకుంటారు ...'' అంటూ రామారావును సాధించడం మొదలెట్టింది.

* * *

సుబ్బారావు భోంచేసి భార్య తెచ్చిన కిళ్ళీ నములుతూ లుంగీ విప్పేసి, పాంటు వేసుకుని, షర్ట్ పాంటులోకి టక్ చేయడం మొదలెట్టాడు. మంచిమూడ్‌లో ఉన్నట్లు అతను వేస్తున్న ఈలవే తెలుపుతుంది.

''పారు, ఈ సాయంత్రం ప్రోగ్రామేంటి? ఎగ్జిబిషన్‌కు వెళ్దామా, ఇవ్వాళ ఆఖరి రోజట.''




అంటూ తనభార్య పార్వతినడిగాడు సుబ్బారావు.

''ఏంటండి రోజు తిరగడమే. నిన్న, మొన్న సినిమాలకెళ్ళాము. అంతకు ముందు మూడు రోజులు ఫ్రెండ్సునిక్కడెక్కడో తిప్పారు. ఇవ్వాళ హాయిగా ఇంట్లోనే రెస్టు తీసుకుందాము'' అంది పార్వతి.

''అదేం లాభం లేదు డియర్. ఇవ్వాళ వెళ్ళాల్సిందే. నాలుగున్నర కంత ఇంట్లో ఉంటాను. రాత్రికి వంట చేయొద్దులే. ఎగ్జిబిషన్ నుంచి వస్తూ ఏదో హోటల్లోనే భోంచేద్దాం'' అన్నాడు సుబ్బారావు. ఇక ఆవిడకి సరేనని అనడానికి కూడా అవకాశం ఇవ్వకుండా గట్టిగా ఈల వేస్తూ బుగ్గమీద చిటిక వేసి, ఇంటి బయటకు వెళ్ళి స్కూటర్ స్టార్ట్ చేశాడు. స్కూటర్ మీద కూర్చొని, ఓ సిగరెట్ అంటించి, కిళ్ళీ వల్ల ఎర్రగా పండిన నోటినుంచి ఓ ముద్దు భార్యకి గాలిలో ఊది, స్కూటర్ తన ఆఫీస్ వైపుకు దౌడు తీయించాడు.

రామారావు ఆఫీసులో కూర్చుని, అక్కడ ఆఫీసుకి వచ్చిన వాళ్ళనందరిని ఓసారి చూశాడు. చాలా మటుకు అందరు సమయానికి వచ్చారు. సుబ్బారావు ఇంకా రాలేదు. రామారావుకి అతనింకా రాలేదని ఆతృతగా ఉంది. అతను వస్తేగాని తన పని కాదు. పని అవ్వతేకాని తను ఇంటికి పోలేదు. రామారావు అసంకల్పితంగా గోళ్ళు కొరుక్కోవడం మొదలెట్టాడు. సుబ్బారావుకు పని గురించి పట్టించుకోనవసరం లేదు. తీరిగ్గా కనీసం ఓ అరగంట ఆలస్యంగా వస్తాడు ఆఫీసుకు. తనేం పన్జేసుకోవాలో నిర్ణయించుకుని, దర్జాగా సిగరెట్టు త్రాగుతూ, పాన్ నములుతూ తన పని చేసుకుని సాయంత్రం మిగిలిన వాళ్ళ పనెంతవరకు వచ్చిందో ఓసారి చూసుకుని, అందరికి బై, బై చెప్పి వెళ్ళిపోతాడు. ఎంతైనా అదృష్టవంతుడు. చక్కటి జీతం, రాజా లాంటి ఉద్యోగం.

రామారావు ఆలోచనలకడ్డుతగులుతూ, సుబ్బారావు సరిగ్గ తన టైముకు, అదే ఆఫీస్ టైంతో పోలిస్తే ఓ అరగంట ఆలస్యంగా పెద్దగా ''హలో, హలో, '' అంటూ అక్కడున్న ఉద్యోగు లందరితో చాలా స్నేహంగా మాట్లాడుతు వచ్చాడు. సుబ్బారావును చూస్తూనే ఎంత

మార్చు. అందరూ అతనిని "హలో సుబ్బారావు గార"ంటు విష్ చేశారు. పలకరింపుగా, భయంగా, ఎంతో ఆత్మీయంగా నవ్వారు. సుబ్బారావు ప్రత్యేకతయే అది. అందరిచేత నవ్విస్తూనే పని చేయించుకోగలడు. సుబ్బారావు తన కుర్చీలో కూర్చొని సిగరెట్టు తీసి అంటించాడు. తన ముందున్న ఫైళ్ళు ఓ అరగంట చూసి, ఏదో వ్రాసేసి, "యాదయ్య ఈ ఫైళ్ళను తీసి కెళ్ళు" అంటూ ప్యూనుకు చెప్పాడు. తనతో తెచ్చుకున్న సినిమా పత్రికలను అటు తరువాత



చూడటం మొదలెట్టాడు ఇదంతా చూస్తున్న. రామారావు, ఇదే మంచి సమయం, ఇప్పుడు సుబ్బారావు మంచి మూడులో ఉంటాడని, సుబ్బారావు దగ్గరికి వచ్చి, అతని ముందు నిలబడి, 'ఎక్స్‌క్యూజ్ మి' అన్నట్లు దగ్గాడు. సుబ్బారావు రామారావును తలెత్తి చూసి ఏం కావాలన్నట్లు కను బొమ్మలెగరేసాడు.

"మీరేం అనుకోకుంటే సుబ్బారావుగారు ఓ ఫేవరు చేయాలండి."

"చెప్పండి" అన్నాడు సుబ్బారావు కుర్చీలో కూర్చునే.

రామారావును కుర్చీలో కూర్చోమని కూడా చెప్పలేదు. కాని, పని తనదవ్వటం మూలాన, రామారావు పెద్దగ ఫీల్ అవ్వలేదు.

"మరేం సుబ్బారావు గారు, నేను ఇవ్వాళ కొంచెం అర్జంటుగ, అదేనండి మామూలు మన ఆఫీసు టైంకి, 5.30 కంత సాయంత్రం ఇంటికి వెళ్ళ గలిగితే చాలు. వారం రోజుల నుంచి 3, 4 గంటలు ఆలస్యంగ పని చేయవలసి వస్తుంది. ఇంటికి వెళ్ళేసరికి రాత్రి 8, 9 గంట లౌతున్నది. మీరు కొంచెం




స్పెన్సర్స్
లగ్జరీ టాల్క్

ఎందుకంటే మీ శరీరానికి దీని అవసరం ఉంది.
ఇది మీరు పెట్టగల ధరలో లభిస్తుంది.

స్పెన్సర్స్ లగ్జరీ టాల్క్, మీకు సరిగ్గా సరైనది. మీకు శుభ్రమైన తాజాదనపు అనుభూతి కలగడంలో తోడ్పడే ప్రత్యేక డియోడరెంట్ గలది. రోజంతా మీకు ఆహ్లాదం కలగించే విశిష్టమైన విదేశీ పరిమళం గలది. పైగా ఎంతో చౌకైనది.

కనుక స్పెన్సర్స్‌కు మారిపోండి. ఇది మీకు సరిగ్గా సరైన టాల్క్. 4 దివ్యమైన పరిమళాలలో లభిస్తుంది : లవెండర్, రోజ్, ఫ్లోరల్, శాండల్.

తయారీదార్లు :
స్పెన్సర్స్ అండ్ స్పెన్సర్స్ కం.
48, నంద్ ఘనశ్యామ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆఫ్ మహాకాళీ రోడ్,
అంధేరీ (ఈస్ట్) బొంబాయి-400 093. (ఫోన్ : 6345532)

ఆంధ్రప్రదేశ్‌కు బుకింగ్ ఏజంటు:
Mr. గ్రంధి యుగంధర్ 5వ లైన్, పార్క్ రోడ్, కృష్ణనగర్,
గుంటూరు-2.
ఫోన్: 30106

అనుకుంటే నేను ఇంటికి మామూలు టైంకి వెళ్ళవచ్చును."

సుబ్బారావు నిర్లక్ష్యంగా, అధికార దర్పంతో "నన్నేం చేయమంటారండి. ఎవరి పన్లు వాళ్ళు చేసుకోవాలి. నా పని అయిపోతే నేను వెళ్ళి పోతాను. అలాగే మీ పని అయిపోయిన తరువాత మీరెళ్ళండి. ఎవ్వరి బాధ్యత వారికుంటుంది కదా" అని జవాబిచ్చాడు.

"అదేనండి నేను చెప్పడం మీరనుకున్నా రంటే, మిగతవాళ్ళకూడ పని తొందరగ చేసేసి, నా పని తొందరగయ్యేటట్లు చేయగలరు. మీరంటే భయము, గౌరవము అన్ని మిగతావాళ్ళకున్నాయి. మీకు తెల్సుగ, అకౌంట్సు అన్ని క్లోజ్ చేస్తే కాని నేనింటికి వెళ్ళలేనని. మిగతా వాళ్ళు పని చేసేట్టు చేయడం మీ వల్లనే సాధ్యం..."

"చూద్దాం లెండి" అంటూ, ఇంకా ఏదో మాట్లాడబోతున్న రామారావును మధ్యంతరం లోనే ఆపేసి, తిరిగి ప్రముఖ సినీతార, తారాదేవి తన కుక్కకు సబ్బుకొంటానని ఏ హీరోతో లండన్ పోయిందో చదవడంలో మునిగిపోయాడు.

— రామారావు చేసేదేంలేక, తన సీటుకు వచ్చి కూర్చొని, సుబ్బారావు మిగిలిన వాళ్ళతో చెప్పి, తన పని సులభం చేయిస్తాడా లేదానని అప్పుడప్పుడు గోళ్ళు కొరుకుతూ, తన వద్ద కొచ్చిన, లెడ్జర్లు, ఫైళ్ళు చూడసాగాడు. రామారావు నోటికి గోళ్ళ మొదలు తగిలి, కొరకడానికి ఇంక గోళ్ళేమి లేవని తెలుసుకునేసరికి సాయంత్రం 4.15 అయ్యింది సుబ్బారావు లేచి ఓసారి అందరిని చూసి, బై, బై అంటూ ఆఫీసు బయటకు వచ్చి స్కూటరు స్టార్టు చేసాడు. సుబ్బారావు మనస్సులో ఎగ్జిబిషన్ నుండి తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు భార్యతో హోటలుకు పోవాలన్న ఆలోచన తప్పితే మరేమి లేదు.

రామారావు ఆ రోజు ఇంటికి రాత్రి 9.30కి వెళ్ళేసరికి, ఇంటి తలుపుకున్న తాళం కప్ప వెక్కిరించింది.

* * *

ఇంతకీ, సుబ్బారావు ఆ ఆఫీసులో చేసేది గుమస్తా ఉద్యోగమే. కాదంటే ఉద్యోగుల యూనియన్‌లో ఓ చిన్న లీడరు.

మరి రామారావు?

ఆ ఆఫీసు మేనేజరు.